సాక్షి రాజన్న సిరిసిల్ల

మంగళవారం, 23, మే, 2023



విత్తన దుకాణాల్లో తనిఖీలు

వేములవాడఅర్బన్: వేములవాడలోని ఫర్టిలైజర్ దుకాణాలను టాస్క్‌ఫోర్స్ టీమ్ సోమవారం తనిఖీ చేసింది. వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్, ఏవో సాయికిరణ్ ఉన్నారు.



మండు వేసవిలో మత్తళ్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండు వేసవిలోనూ జిల్లాలో చెరువులు, కుంటల మత్తుళ్లు దూకుతున్నాయి. వాగులకు జలకల సంతరించుకుంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

తెల్లవారుజామున గాలివాన

- పది మండలాల్లో వర్షం
- వీర్నపల్లిలో అత్యధికంగా 26.5 మిల్లీమీటర్లు

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. విపరీతమైన గాలులు వీస్తూ వర్షం పడింది. వీర్నపల్లి మండలంలో అత్యధికంగా 26.5 మిల్లీమీటర్ల వర్షం పడగా.. వేములవాడ, వేములవాడరూరల్, ఇల్లంతకుంటల్లో పెద్దగా వర్షం లేదు. రుద్రంగిలో 12.6 మిల్లీమీటర్లు, చందుర్తిలో 0.6, బోయినపల్లిలో 1.7, సిరిసిల్లలో 14.6, కోనరావుపేటలో 4.8, ఎల్లారెడ్డిపేటలో 5.1, గంభీరావుపేటలో 6.7, ముస్తాబాద్‌లో 3.4, తంగళ్లపల్లిలో 12.8 మిల్లీమీటర్ల వర్షం పడింది. మే నెలలో సిరిసిల్లలో సాధారణ వర్షపాతం 0.2 మిల్లీమీటర్లు కాగా.. సోమవారం తెల్లవారుజామున జిల్లాలో సగటు వర్షపాతం 6.8 మిల్లీ మీటర్లుగా నమోదైంది.

సత్వర న్యాయమే గ్రీవెన్స్‌సెల్ లక్ష్యం



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: వివిధ సంఘటనలు, కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడమే గ్రీవెన్‌సెల్ లక్ష్యమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో 20 మంది తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీలు అందించారు. వాటిని పరిష్కరించాలని ఆయా స్టేషన్ ఆఫీసర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కులవృత్తులకు ప్రాధాన్యం



లైసెన్సులు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. కొదురుపాక రైతువేదిక భవనంలో రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావుతో కలిసి మత్స్యశాఖ ఆధ్వర్యంలో 32 మంది పీఏఎఫ్(ప్రాజెక్టు ఎఫెక్టెడ్ ఫ్యామిలీ) కుటుంబాలకు చేపలు పట్టడానికి లైసెన్స్‌లు అందించారు. తడగొండ, బూర్గుపల్లి గ్రామాల్లో మత్స్యకార్ల సంఘం రిజిస్టర్ లైసెన్స్ ఇచ్చారు. ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ ముంపు గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలు చేపలు పట్టి ఉపాధి పొందేందుకు ప్రభుత్వం లైసెన్స్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు రైతువేదిక భవనం చుట్టూ రూ.14 లక్షలతో చేపట్టే ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. ఎంపీపీ పి.వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, డీడీ ఫిషరీస్ శివప్రసాద్, తహసీల్దార్ నరేశ్, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్, భాస్కర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని అడవిపదిర, మద్దిమల్ల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. అడవిపదిరలో 2.40 కోట్లతో రోడ్‌డ్యామ్ పనులు, రూ.8 లక్షలతో మహిళా సంఘ భవనం, రూ.5 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం, మద్దిమల్లలో రూ.32 లక్షలతో పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోతు భూల, సెస్ డైరెక్టర్ మల్లేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు కళ పాల్గొన్నారు.

3,900 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటి వెలుగు–2లో సోమవారం 3,900 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 448 మందికి రీడింగ్ అద్దాలను, 417 మందికి పాయింట్ అద్దాలను అందించారు. 26 ప్రాంతాల్లో 234 మంది వైద్యసిబ్బంది శిబిరాల్లో పాల్గొన్నారు. 80 రోజులుగా జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 3,02,635 మందికి కంటి పరీక్షలు చేసినట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు తెలిపారు. ఇప్పటి వరకు 48,422 మందికి రీడింగ్ అద్దాలు, 41,618 పాయింట్ అద్దాలను అందించినట్లు వివరించారు.



ఓటాబందీ కొనసాగించండి

సిరిసిల్లఅర్బన్: వీఆర్‌ఏల రెగ్యులరైజేషన్‌ను రద్దు చేసి ఓటాబందీ విధానం కొనసాగించాలని కోరుతూ సుంకరి ఇస్పాదార్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీటి ఉమేశ్‌రావు, బీఎస్పీ నాయకులు వీరికి మద్దతు తెలిపారు. ఇన్‌చార్జి డీఆర్వోకి వినతిపత్రం అందించారు. సుంకరి ఇస్పాదార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు, ఉపాధ్యక్షుడు బత్తుల దేవదాస్, బీఎస్పీ నాయకులు అంకని భాను, స్వామిగౌడ్, బొడ్డు మహేందర్, లింగంపల్లి మధుకర్ ఉన్నారు.



సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లఅర్బన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతీ నెల వేతనాన్ని ఖాతాలో జమచేయాలని కోరారు. డీఈవోకు వినతిప్రతం అందజేశారు. జిల్లా కో-కన్వీనర్ లక్ష్మి, నాయకులు పంతం రవి, నాగరాజు తదితరులు ఉన్నారు.

సాదాబైనామా సందిగ్ధం



సిరిసిల్లలోని శాంతినగర్ మీసేవ కేంద్రంలో వేలిముద్ర వేస్తున్న రైతు (ఫైల్)



మూడున్నర దశాబ్దాల కిందట రాయించుకున్న సాదాబైనామా పత్రం

- మూడేళ్లుగా నిరీక్షణ
- మార్గదర్శకాలు ఇవ్వని ప్రభుత్వం
- ముగిసిన అధ్యాయమంటున్న అధికారులు
- జిల్లాలో 15,056 మంది రైతుల నిరీక్షణ



"ఇతని పేరు తంగళ్లపల్లి ముత్తయ్య(61) కోనరావుపేట మండలం ధర్మారం. ముత్తయ్య, అతని సోదరులకు ఉమ్మడిగా 2.05 ఎకరాల భూమి ఉంది. చాలా ఏళ్ల కిందటే కొనుగోలు చేసిన ఆ భూమి వీళ్ల పేరిట పట్టా కాలేదు. పాస్‌బుక్కు లేకపోవడంతో రైతుబంధు వస్తలేదు. ఆ భూమిలో చెరువు కాల్వ నిర్మించారు. కబ్జాలో ఉన్నారని ప్రభుత్వం నుంచి పరిహారం డబ్బులు కూడా వచ్చాయి. కాల్వలో పోయిన భూ మిని మినహాయించి మిగిలిన 34 గుంటలను సాదాబైనామా ప్రకారం చెరో 17 గుంటలు పట్టా చేయాలని 2020లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి ముత్తయ్య పాస్‌బుక్కు కోసం నిరీక్షిస్తున్నాడు. ఇలాంటి సమస్య జిల్లా వ్యాప్తంగా 15,056 మంది రైతులు ఎదుర్కొంటున్నారు."

సిరిసిల్ల: సాదాబైనామాల ద్వారా కొన్న భూమిని పట్టా చేయించుకునేందుకు ఏళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. 2020 అక్టోబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం సాదాబైనామాలకు అవకాశం కల్పించింది. అక్టోబర్ 31తో గడువు ముగిసిపోగా.. నవంబర్ 10 వరకు పొడిగించడంతో జిల్లా వ్యాప్తంగా 15,056 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో రెవెన్యూ అధికారుల్లో సందిగ్ధం.. రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఊసే లేని సాదాబైనామా

కొత్త రెవెన్యూ చట్టంలో సాదాబైనామాల ఊసే లేదు. సాదాబైనామాలు ఉన్నా రికార్డుల్లో మార్పులు, చేర్పులకు వీలులేదు. పాత రెవెన్యూ చట్టం ప్రకారం సాదాబైనామాలతో హక్కులు కల్పించే అధికారం తహసీల్దార్లకు ఉండేది. పాతవిధానంలో తహసీల్దార్లు సాదాబైనామాలను మ్యుటేషన్ చేస్తారా? ఆర్డీవోలకు అప్పగిస్తారా? అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు ఇస్తారా ? అనే విషయంలో మూడేళ్లుగా స్పష్టత రావడం లేదు.

అన్ని మండలాల్లోనూ దరఖాస్తులు

జిల్లాలో సాదాబైనామాల కోసం అత్యధికంగా కోనరావుపేట మండలంలో 2,690 మంది, అత్యల్పంగా రుద్రంగిలో 162 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీర్నపల్లి మండలంలో 379, బోయినపల్లి లో 764, చందుర్తిలో 1,259, గంభీరావుపేటలో 1,403, ఇల్లంతకుంటలో 1,536, ముస్తాబాద్‌లో 1,685, సిరిసిల్లలో 428, తంగళ్లపల్లిలో 1,776, వే ములవాడలో 675, వేములవాడరూరల్‌లో 1,072, ఎల్లారెడ్డిపేటలో 1,227 మంది దరఖాస్తు చేసుకున్నారు.

మాకు అధికారం లేదు



సాదాబైనామాల అమలుపై ఎవరికీ ఎలాంటి అధికారాలు లేవు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి మీసేవ ఆన్‌లైన్‌లో అప్పట్లో దరఖాస్తు చేశారు. కొత్త రెవెన్యూ చట్టంలో సాదాబైనామాల ప్రస్తావనే లేదు. ఇక అది ముగిసిన అధ్యాయంగానే భావించాలి.
– టి.శ్రీనివాస్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి

ఆన్‌లైన్ కష్టాలను అధిగమించి

సాదాబైనామాల అమలుకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేశారు. భూమి అమ్మిన వ్యక్తి వివరాలతోపాటు కొనుగోలు చేసిన వారి సమాచారం, సర్వేనంబరు, ఆధార్‌కార్డు నంబర్, ఫొటో, ఫింగర్ ప్రింట్ లేదా ఐరిష్ నమోదు చేసి మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో వీటిని అప్‌లోడ్ చేశారు. గ్రామ కంఠం స్థలాలకు సర్వే నంబరు లేక ఆన్‌లైన్‌లో నమోదుకాలేదు. ధరణి పోర్టల్‌లో కొన్ని సర్వే నంబర్లు నమోదు కాలేదు. దీంతో సాదాబైనామా పత్రం ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదుకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

క్రీడలతో మానసిక వికాసం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



విజేత టీం సభ్యులతో చైర్‌పర్సన్లు అరుణ, కళ

సిరిసిల్లటౌన్: విద్యార్థుల్లో మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్లలోని మినీస్టేడియంలో సీఎం కప్ క్రీడా సంబరాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో క్రీడలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు రోజులపాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో పేరుకు తీసుకురావాలని కోరారు. వివిధ పోటీల్లో గెలుపొందిన జట్లను అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉపేందర్‌రావు, పోటీల నిర్వహణ ఇన్‌చార్జి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఎగువ మానేరు కెనాల్‌ను బాగుచేస్తాం

- నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ శంకర్



లీకవుతున్న అక్విడేటర్‌ను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శంకర్

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎగువ మానేరు ప్రాజెక్టు కెనాల్‌ను బాగుచేసి చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందిస్తామని నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ శంకర్ అన్నారు. మండలంలోని ఎగువమానేరు ప్రాజెక్టు లోతుచెరువు, డీ–15 నుంచి డీ–18 వరకు ఉన్న డిస్ట్రిబ్యూటరీలను ఈఎన్‌సీ సోమవారం పరిశీలించారు. గోపాల్‌పల్లిలో కూలిపోయిన కెనాల్ వంతెన స్థానంలో కొత్తది నిర్మించేందుకు అంచనాలు తయారు చేస్తామన్నారు. లోతు చెరువులో నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ముస్తాబాద్ శివా రులోని రెండు అక్విడేటర్ల లీకేజీని సరిచేసేందుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ముస్తాబాద్‌లో మానేరు కెనాల్‌లోకి మురుగునీరు చేరకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఈ అమరేందర్, డీఈఈ రవికుమార్, ఏఈలు వంశీకృష్ణ, ప్రవంతి ఉన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో మెదక్ ఎంపీ

- అధ్యయనం చేసిన దుబ్బాక నేతన్నలు



మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లా దుబ్బాక నేతన్నలకు టెక్స్‌టైల్ పార్కు సందర్శన, అధ్యయనం కోసం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తి అవుతున్న క్లాత్, కార్మికుల స్థితిగతులు, యజమానుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దుబ్బాకలో పెద్ద సంఖ్యలో ఉన్న నేత కుటుంబాలకు మెరుగైన ఉపాధి కల్పించడమే ఈ పర్యటన ఉద్దేశ్యమన్నారు. రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌తోపాటు స్థానిక నాయకులు ఉన్నారు.

సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ



నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్



నివాళి అర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల: సమాజంలో దళితులు, బలహీన వర్గాల జీవితాల్లో మార్పు కోసం ఉద్యమించిన సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మ అని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కొనియాడారు. కలెక్టరేట్‌లో సోమవారం భాగ్యరెడ్డివర్మ జయంతి నిర్వహించారు. దళిత బాలికలను చదివించేందుకు 26 పాఠశాలలను ఏర్పాటు చేశారని, మూఢాచారాలకు వ్యతిరేకంగా, సారా నిషేధం కోసం భాగ్యరెడ్డివర్మ ఉద్యమించారని గుర్తు చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే అణగారిన వర్గాల కోసం పనిచేసిన సామాజిక ఉద్యమకారుడు భాగ్యరెడ్డివర్మ అన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల, కోనరావుపేట, ఇల్లంతకుంట సింగిల్‌విండో చైర్మన్లు బండి దేవదాస్, బండ నర్సయ్య, రొండ్ల తిరుపతి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్ పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: దళిత హక్కులు, సమానత్వం కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తగా భాగ్యరెడ్డివర్మను ఎస్పీ అఖిల్ మహాజన్ కొనియాడారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలు నిర్వహించారు.

రాజన్నకు జనసందడి



వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణ భక్తులతో రద్దీగా మారింది. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి.. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి వీచిన గాలులకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

వెల్లువలా విన్నపాలు

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రజావాణికి 34 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువలా వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు తెలుపుకునేందుకు భారీగా బాధితులు తరలివచ్చారు. కలెక్టర్ అనురాగ్ జయంతికి తమ సమస్యలు మొర పెట్టుకున్నారు. చిన్నబోనాలకు చెందిన గాజులవేణి రాజవ్వ పెన్షన్ ఇప్పించాలని వేడుకోగా.. కోనరావుపేట మండలంలోని ధర్మారంలో పాత జీపీ ఉన్న స్థలంలోనే నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని సర్పంచ్ గున్నాల అరుణ కలెక్టర్‌కు విన్నవించారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్.. త్వరగా పరిష్కరించాలని అక్కడే ఉన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలపై 34 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, ఆర్డీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లారీల కొరత తీర్చాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత లేకుండా చూడాలి. లారీలు సరైన సమయంలో రాకపోవడంతో తూకం వేసిన బస్తాలు అకాల వర్షానికి తడిసిపోతున్నాయి. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై దృష్టి సారించి లారీల కొరతను తీర్చాలి.
– గడ్డం నర్సయ్య, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు

ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు



నాపేరు అల్లె రుక్కవ్వ బీవైనగర్‌లో ఉంటాను. నాకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. నా భర్త పర్శరాములుకు నాలుగేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుండి నేనే అన్ని సపర్యలు చేస్తూ పెన్షన్ డబ్బులతో జీవిస్తున్నాం. మా కొడుకులు ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. ఎక్కడికి పోలేక ఇంటిముందున్న చెట్టుకింద తలదాచుకుంటున్నాం. ఇంట్లోకి రానివ్వడం లేదు. ఏ ఆధారం లేని మేము ఎక్కడికి పోలేం. మాకు న్యాయం చేయండి.
– రుక్కవ్వ దంపతులు

పెన్షన్ ఇప్పించండి



నాకు ఆసర పెన్షన్ ఇప్పించాలని అధికారులను ప్రాదేయపడిన ఎవరూ పట్టించుకోవడం లేదు. వయస్సు పైబడడంతో ఏ పని చేయలేకపోతున్నాను. అధికారులు స్పందించి పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలి.
– కర్నె మల్లవ్వ, చిన్నబోనాల వృద్ధురాలు

మూడు చక్రాల బండి ఇప్పించండి



మేము మండేపల్లి కేసీఆర్ నగర్ కాలనీ దివ్యాంగుల సొసైటీకి చెందిన వాళ్లము. మేము నడవలేని పరిస్థితులలో ఉన్నాం. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా మూడు చక్రాల బండి గురించి దరఖాస్తు చేసుకున్నాం. కానీ ఎవరికీ మంజూరు కాలేదు. కలెక్టర్ స్పందించి మూడు చక్రాల వాహనాలు మంజూరు చేయాలి.
– కేసీఆర్ నగర్ కాలనీ దివ్యాంగులు

సిబ్బందిని నియమించాలి



కోనరావుపేట రెవెన్యూ కార్యాలయంలో సరైన సిబ్బందిని నియమించాలి. సిబ్బంది కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యను త్వరగా పరిష్కరించాలి.
– ఎంపీపీ చంద్రయ్య

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్ పీఎస్ శ్రీనివాస్‌కు పరామర్శ


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర మంత్రి కేటీఆర్ పీఎస్ కానుగుల శ్రీనివాస్ తల్లి రాములమ్మ అనారోగ్యంతో మరణించగా.. వారి కుటుంబ సభ్యులను నల్లగొండలోని వారి స్వగృహం ఎల్లారెడ్డిపేటకు చెందిన నాయకులు సోమవారం పరామర్శించారు. రాములమ్మ మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అందె సుభాష్, గుల్లపల్లి నర్సింహారెడ్డి ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

కోనరావుపేట : మండలంలోని వెంకట్రావుపేటలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బావుసాయిపేటకు చెందిన షేక్ యూసుఫ్–నౌసిన్ దంపతులు తమవంతు విరాళం అందించారు. గ్రామంలో సర్పంచ్ మంతెన సంతోష్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. బావుసాయిపేటకు ముస్లిం దంపతులు విరాళాన్ని ఆలయ చైర్మన్ వడ్నాల రవీందర్‌కు అందజేశారు.

తాత్కాలిక ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తులు

సిరిసిల్లకల్చరల్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయిలో తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని డీఈవో రమేశ్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కోఆర్డినేటర్లు, సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్లు, సిస్టమ్ అనలిస్టులు, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆపరేటర్లు పరస్పర బదిలీలు, అంతర్ జిల్లా పరస్పర బదిలీలు కోరుకుంటే తమ అభ్యర్థనలు అందజేయాలని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ rchooedu. teanfana. gov.in/M ఆన్‌లైన్‌లో ఈనెల 25లోపు వివరాలు సమర్పించాలని సూచించారు. దంపతులు, ఇతర ప్రిఫరెన్షియల్ కేటగిరీల వారు సంబంధిత ఆధారాలతో దరఖాస్తు చేయాలని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని కేశపెరమాండ్ల గుట్ట వద్ద పేకాటాడుతున్న ఆరుగురిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.21,690 నగదు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నగదు స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

మండు వేసవిలో మత్తళ్లు

- జిల్లాలో 555 చెరువులకు జలకళ
- మానేరు వాగు సజీవ జలదృశ్యం
- పెరిగిన భూగర్భ జలాలు, ఆయకట్టు
- సస్యశ్యామలం అవుతున్న బీడు భూములు


మత్తడి దూకుతున్న చెరువు


ముస్తాబాద్‌లోని పెద్ద చెరువుకు చేరిన గోదావరి జలాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండు వేసవిలో జిల్లాలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. జిల్లాలో ఎగువ మానేరు ప్రాజెక్టు మొదలు.. మధ్య మానేరు ప్రాజెక్టు వరకు మానేరు వాగు సజీవ జలదృశ్యం ఆవిష్కృతమవుతోంది. కాళేశ్వరం గోదావరి జలాలు జిల్లాకు తరలిరాగా బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయి. జిల్లాలో 555 చెరువులు, కుంటలు జలకళతో కళకళలాడుతున్నాయి. పదేళ్ల క్రితం కేవలం వానాకాలంలోనే చెరువులకు నీరు చేరే పరిస్థితి నుంచి మల్లన్నసాగర్ ప్రాజెక్టు పుణ్యామాని తాగు, సాగు నీటికి ఢోకా లేని పరిస్థితికి చేరుకుంది.

వాగు పొడుగునా జలదృశ్యం..

గత మూడేళ్లుగా నర్మాలలోని ఎగువమానేరు ప్రాజెక్టులోకి మల్లన్నసాగర్ జలాలు వచ్చి చేరుతున్నాయి. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టు కెనాల్‌ను కూడవెళ్లి వాగులోకి మళ్లించారు. అక్కడ శాశ్వతంగా షట్టర్‌ను నిర్మించి, ప్రతి వేసవికి ముందు నీటిని కూడవెళ్లి వాగులోకి వదులుతున్నారు. దీంతో కూడవెళ్లి వాగు ద్వారా నీరు మానేరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఇక్కడి నుంచి మధ్య మానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం) వరకు వాగు నీటితో కళకళలాడతోంది. మధ్యలో పది చెక్ డ్యామ్‌ల్లోకి నీరు చేరుతుంది. మల్లారెడ్డిపేట, సింగారం, కొండాపూర్, పదిర, ఆవునూర్, సిరిసిల్ల నెహ్రూ నగర్‌లో ఉన్న చెక్ డ్యామ్‌లు మత్తళ్ల దూకుతున్నాయి. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ జలాశయాల నుంచి ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, గంభీరావుపేట మండలాలకు గోదావరి జలాలు వస్తున్నాయి. ప్రస్తుత వేసవిలో ఎండిపోయిన చెరువుల కు నీటిని అందించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని 20 చెరువులు పూర్తిగా నిండి మత్తళ్లు పోస్తున్నాయి. మరో 73 చెరువులు 75 శాతానికి పైగా నిండాయి. తొమ్మిదో ప్యాకేజీ ద్వారా వీర్నపల్లి, కోనరావుపేట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట చెరువులు నిండాయి. ఇల్లంతకుంటలో అంతగిరి ప్రాజెక్టు ద్వారా అక్కడి చెరువుల్లోకి నీరుచేరింది. సీఎం కేసీఆర్ దార్శనికతతోనే రైతులకు రెండు సీజన్లలో నీటిని అందించే బృహత్తర సాగునీటి పథకం అమలు అవుతోందని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన ఆయకట్టు..

జిల్లాలో మల్లన్నసాగర్, తొమ్మిదో ప్యాకేజీ ద్వారా ఆయకట్టు పెరిగింది. రైతులు పెద్ద ఎత్తున పంటలుసాగు చేస్తుండగా.. 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తోంది. లక్ష ఎకరాలకుపైగా రైతులు పంటలు సాగుచేస్తున్నారు. బీడు భూములు పెద్ద ఎత్తున సాగులోకి వస్తున్నాయి. అలాగే భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. అలాగే మిషన్ భగీరథకు అవసరమైన నీటిని వినియోగిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నూరు శాతం నిండిన చెరువులు	20
75 శాతం నిండిన చెరువులు	73
50 శాతం నిండిన చెరువులు	95
25 శాతం నిండిన చెరువులు	33
మానేరు వాగుపై నిండిన డ్యామ్‌లు	08

పచ్చని పొలాలతో జలకళ



సిరిసిల్ల జిల్లా కోనసీమకు తీసిపోని విధంగా ఉంది. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, తొమ్మిదో ప్యాకేజీ ద్వారా గోదావరి జలాలు వచ్చి చేరుతున్నాయి. చెరువులు, డ్యామ్‌లు నిండుతున్నాయి. సీఎం కేసీఆర్ గొప్ప విజన్‌తో వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. పచ్చని పొలాలతో జిల్లా కళకళలాడుతోంది. నేడు ఎగువ మానేరు ప్రాజెక్ట్ నుంచి దిగువ మానేరు ప్రాజెక్టు వరకు మానేరు వాగు సజీవ జలదృశ్యాన్ని సంతరించుకుంది.

– మంత్రి కేటీఆర్, ఐటీ శాఖ మంత్రి

బీడు భూములు సస్యశ్యామలం



చెరువులు, కుంటల్లోకి గోదావరి జలాలు వచ్చి చేరాయి. మూడేళ్లుగా మానేరు ప్రాజెక్టు మండు వేసవిలో మత్తడి దూకుతోంది. సాగు, తాగు నీటికి ఢోకా లేదు. రైతులు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారు. బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయి. వేసవిలో ఎక్కడా చూసిన నీరే కనిపస్తోంది.

– జనగామ శరత్‌రావు, ఎంపీపీ

మూడు పంటలు సాగు



గోదావరి జలాల రాకతో ఇక నుంచి రైతులు మూడు పంటలు వేసుకోవచ్చు. జిల్లాలో చెరువులు, ప్రాజెక్టులో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. కెనాల్ లు , వాగులు, బోర్లలోని నీటితో కళకళలాడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఆంధ్రాలో లాగే మూడు పంటలు సాగు చేసుకోవచ్చు.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, రైతుబంధు సమితి అధ్యక్షుడు

వాట్సాప్‌లో వ్యాఖ్యలపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): వాట్సాప్ గ్రూప్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్దికి చెందిన పర్శరాములు సర్పంచ్, ఎంపీటీసీ తనయుడిపై వాట్సాప్ గ్రూప్‌లో అసత్య ఆరోపణలు చేశారనే ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. వారం క్రితం పర్శరాములు తెర్లుమద్ది గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో ప్రభుత్వ భూముల కేటాయింపులో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. పేదలకు పట్టాలివ్వాలని, ఐకేపీ కొనుగోలు కేంద్రానికి స్థలాన్ని కేటాయించాలనే ఉద్దేశంతో తాము పనిచేస్తుంటే తమను అవమానించేలా పర్శరాములు వ్యాఖ్యలు చేశారని సర్పంచ్ కిషన్‌రావు, బైతి నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిజనిరూపణకు రావాలని పిలిస్తే.. తమపై దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలపై ఫిర్యాదుతో పర్శరాములుపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్సై తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి : మండలంలోని కొదురుపాకలో సోమవారం మండల బీజేపీ యువ నాయకులు అనిల్, నాగరాజుతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్ రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ చిక్కాల సుధాకర్ రావు, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, అనుముల భాస్కర్, కొండం నారాయణ రెడ్డి, గుడి శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బజ్జీలలో గంజాయి

- పోలీసుల అదుపులో నిందితులు

కోనరావుపేట(వేములవాడ): హోటల్‌లో అమ్మే బజ్జీలలో గంజాయి కలుపుతూ ప్రజలను వ్యసనానికి గురిచేస్తున్న నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు. మండలంలోని నిజామాబాద్‌లో ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన రిజ్వాన్ హోటల్ నడుపుతుంటాడు. మిర్చీలు, బజ్జీలలో గంజాయిని కలుపుతూ విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రిజ్వాన్ ఇంటిపై దాడి చేయగా.. గంజాయి ప్యాకెట్ లభించింది. ఈ విషయమై విచారించగా విజయ్ తన ఇంటి ముందు గంజాయి మొక్కలను పెంచుతున్నాడని తెలిసింది. గంజాయి ఆకులను ఎండబెట్టిన తర్వాత మిర్చీలు, బజ్జీలలో కలుపుతున్నట్లు అంగీకరించాడు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 2.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు దండి నరేశ్, జగన్, సత్యం, నాగరాజు ఉన్నారు.


నిజామాబాద్‌లో గంజాయి మొక్కను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

కర్రలేకుండా బయటకెళ్లడం కష్టమే..

- వీధుల్లో కుక్కల వీరంగం
- వేములవాడలో బాలుడిపై దాడి
- ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వైనం


గుంపులుగా కుక్కలు



ఈ చిత్రంలో ఉన్న ఎనిమిదేళ్ల బాలుడు వేములవాడలోని మార్కండేయనగర్‌కు చెందిన దొంతుల సంజయ్. సోమవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కుక్కల దాడి సమయంలో ఎవరూ వీధిలోకి రాకుంటే ప్రాణాలమీదికి వచ్చేదని జనం ఆందోళన చెందుతున్నారు. వెంటనే కుక్కలను నివారించాలని బాలుడి తల్లిదండ్రులు దీప్తి, పవన్‌కుమార్ వేడుకుంటున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పట్టణంలోని మార్కండేయనగర్‌లో చేతిలో కర్రపట్టుకుని కుక్కల భయంతో బయటకు వచ్చారు. రావడంతోనే రెండు కుక్కలు కనిపించడంతో కర్రతో వాటిని బెదిరించి, ముందుకెళ్లారు. ఇలా ఒక్క మార్కండేయనగర్‌లోనే కాకుండా పట్టణంలోని 28 వార్డులలో ఇదే పరిస్థితి ఉంది.

వేములవాడ: వేములవాడలో చేతిలో కర్రలేకుండా బయటకు వెళ్లడం కష్టంగా మారింది. మండుతున్న ఎండలకు తోటు వీధుల్లో కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. పట్టణంలోని మార్కండేయనగర్‌కు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు దొంతుల సంజయ్‌పై సోమవారం కుక్కలు దాడి చేశాయి. సంజయ్ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కల ఆగడాలను నియంత్రించాలని సోమవారం కౌన్సిలర్లు గూడూరి లక్ష్మి, మహేశ్ కమిషనర్ అన్వేష్‌ను కోరారు. పట్టణంలో కుక్కల దాడులు పెరిగిపోయాయని ఉపాధ్యాయ సంఘం నాయకుడు బూర సదానందం ఫోన్‌లో కమిషనర్‌కు విన్నవించారు. వేములవాడ ఏరియా ఆసుపత్రి ప రిధిలో మే 1 నుంచి 22వ తేదీ వరకు 15 మందిపై కుక్కలు దాడి చేశాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

హరితహారంపై గొడ్డలి వేటు



రుద్రంగి(వేములవాడ): అధికారుల అనాలోచిత నిర్ణయంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. అయితే విద్యుత్ తీగల కింద ఉన్నాయనే సాకుతో విద్యుత్ అధికారులు నరికివేశారు. రుద్రంగి మండల కేంద్రంలో విద్యుత్ తీగల కింద హరితహారంలో నాటిన మొక్కలను కొట్టివేశారు. అధికారులకు ముందుచూపు లేకనే విద్యుత్‌తీగల కింద హరితహారం మొక్కలు నాటారని.. అవి నేడు పెరిగి పెద్దవి కావడంతో విద్యుత్‌శాఖ అధికారులు కొట్టివేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై ఎంపీడీవో మాలోతు శంకర్‌ను వివరణ కోరగా.. విద్యుత్‌తీగల కింద మొక్కలు నాటకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ తీగల కింద చెట్ల తొలగింపునకు ఉన్నతాధికారులు అనుమతిచ్చినట్లు తెలిపారు. తొలగించిన చెట్లకు బదులుగా జూలైలో కొత్తగా మొక్కలు నాటుతామన్నారు.

నియామకం


లింగారెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన మూసర్ల లింగారెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ సోమవారం నియామకపత్రం అందజేశారు. వికలాంగుల హక్కుల పరిరక్షణకు బీవీహెచ్‌పీఎస్ కృషి చేస్తుందని, తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి, దివ్యాంగులకు లింగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో దివ్యాంగులంతా ఐక్యంగా ఉండాలన్నారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్ : రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే వడగళ్ల వానతో రైతులు నష్టపోయారని, ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో రైస్ మిల్లర్లు తరుగు పేరిట దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. బస్తాకు నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు పేరిట ధాన్యాన్ని కటింగ్ చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలి


మాట్లాడుతున్న మొగిలి లక్ష్మణ్

వేములవాడరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోని అటెండర్, వాచ్‌మన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన వేములవాడలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో ఎన్నో ఏళ్లుగా అటెండర్, వాచ్‌మన్‌లతో పాటు ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని, విషయంపై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పీఆర్‌సీ గడువు ముగుస్తున్నందున నూతన పీఆర్‌సీ కమిటీని వెంటనే వేయాలని, కేజీబీవీ సీఆర్టీ స్పెషల్ ఆఫీసర్ల బదిలీల్లో లాంగ్ స్టాండింగ్ నిబంధనతో వారికి బదిలీ అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్‌టీల సేవలను పాఠశాల పునఃప్రారంభం నాటికి రెన్యువల్ చేయాలని అన్నారు. సంఘం రాష్ట్ర అకాడమిక్ కో కన్వీనర్ బొగ్గారపు నవీన్, వేములవాడ అధ్యక్షుడు మెడపట్ల కిషన్, రుద్రంగి మండల ప్రధాన కార్యదర్శి మహేశ్, తదితరులున్నారు.

కేసీఆర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం మండెపల్లి డబుల్ బెడ్‌రూమ్(కేసీఆర్ నగర్) సముదాయంలోని అక్రమ నిర్మాణాలను సోమవారం సిరిసిల్ల మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. తంగళ్లపల్లి ఎస్సై పి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ కేసీఆర్‌నగర్‌లో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే డబుల్ బెడ్‌రూమ్ ఇంటి పట్టాను రద్దు చేస్తామన్నారు.

రైతులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

సిరిసిల్లటౌన్: ధాన్యం కొనుగోళ్లలో వ్యాపారులు నిలువు దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి చీటి ఉమేశ్ రావు అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపుపై ప్రశ్నిస్తే లారీల కొరత అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ రైతుల అవస్థలు పట్టించుకోకుండా విదేశాలు తిరుగుతున్నారని విమర్శించారు. ముస్తాబాద్ మండలంలో కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలను అధికార పార్టీ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. పోలీసు వ్యవస్థ బీఆర్‌ఎస్‌కు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. సమావేశంలో చుక్క శేఖర్, గిరిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, దుర్గారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్ల అర్బన్: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి, తదితర మౌలిక వసతులను కల్పించడం లేదన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేస్తామని అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప పనులను వేగవంతం చేయడం లేదన్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టిసారించాలని, లేకపోతే లబ్ధిదారులతో కలెక్టర్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు రమేశ్, మల్లేశం గౌడ్, నాగరాజు, లక్ష్మణ్, మోహన్, తదితరులున్నారు.

‘ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి’

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందుల నరేశ్


సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

సిరిసిల్ల టౌన్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వెంటనే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందుల నరేశ్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు, ఉపకులాల ప్రజలు ఐక్యతతో ముందుకెళ్లాలన్నారు. గ్రామాలను ఉద్యమ కేంద్రాలుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఖానాపురం లక్ష్మణ్, సుంకపాక దామోదర్, తంగళ్లపల్లి దేవరాజు, నేరెళ్ల శ్రీనివాస్, నేదునూరి నర్సయ్య, జాలపెల్లి దేవయ్య, అందే సతీశ్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాను అరికట్టేందుకు చర్యలు

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్


స్వాధీనం చేసుకున్న గుడుంబా

జగిత్యాల క్రైం: నిషేధిత గుడుంబాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో గుడుంబా, బట్టీలు, గుడుంబా స్థావరాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గుడుంబాను అరికట్టేందుకు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.